సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
97053 47483
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నేటి నుంచి ప్రవచనాలు

ఎంవీపీకాలనీ: సుదర్శన సీతారామాచార్యులు నేతృత్వంలో ఈ నెల 26 నుంచి 29 వరకు ఎంవీపీ కాలనీలో 'శ్రీ వేంకటేశ్వర వైభవం' పేరిట ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కందాళ అరుణగాయత్రి, డి.శ్రీనివాస్, వి.వి.ఆదినారాయణమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సెక్టార్–6లోని భద్రం పార్కు వేదికగా సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. దీనిలో భాగంగా తిరుమలలో వేంకటేశ్వర స్వామి వారికి జరిగేలా సుప్రభాతం, తోమాలసేవలు, సహస్ర దీపాలంకరణం, నాదనీరాజనం, తిరువీధి ఉత్సవం, ఏకాంత సేవలను నిర్వహించనున్నామన్నారు. నగరంలోని భక్తులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

సీపీఎం మహాసభల జయప్రదానికి పిలుపు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: సీపీఎం విశాఖ జిల్లా 24వ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌కేఎస్వీ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. సభల పోస్టర్‌ను బుధవారం ఆరిలోవ సీపీఎం కార్యాలయంలో పార్టీ నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 28, 29 తేదీల్లో పెందుర్తిలోని సుజాతనగర్ ఫంక్షన్ హాల్‌లో మహాసభలు జరగనున్నాయని తెలిపారు. సీపీఎం జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతారన్నారు. వారి ఉపన్యాసాలతో ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతెన్నుల గురించి వివరిస్తారన్నారు. ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, సీపీఎం చేస్తున్న పోరాటాలు, భవిష్యత్ పోరాటాల కార్యాచరణ రూపొందిస్తారన్నారు. కార్యక్రమంలో ఆరిలోవ నాయకులు నరేంద్రకుమార్ , శంకరరావు, నాగరాజు, రంగమ్మ, అన్నపూర్ణ, గౌరి, కాంతం, వరలక్ష్మి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కడప యువ సమ్మేళనానికి మై భారత్ వలంటీర్లు


యువ సమ్మేళనంలో పాల్గొనే వలంటీర్లు

ఏయూక్యాంపస్: అంతర జిల్లా యువ సమ్మేళనంలో పాల్గొనడానికి విశాఖ జిల్లాకు చెందిన నెహ్రూ యువ కేంద్రం(మై భారత్) వలంటీర్లు బుధవారం కడప బయలు దేరి వెళ్లారు. వైఎస్సార్ కడప జిల్లాలో ఈ నెల 26 నుంచి ఐదు రోజుల పాటు జరిగే యువ సమ్మేళనంలో వలంటీర్లు భాగమవుతారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు చెందిన 25 మంది యువతీ యువకులు దీనిలో పాల్గొన్నారు. విభిన్న ప్రాంతాల ప్రజలు జీవనం, అలవాట్లు, సంస్కృతులు తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది. భారత యువజన మంత్రిత్వ శాఖ, ఎన్‌వైకే సమన్వయంతో 90 యువ సమ్మేళనాలను దేశ వ్యాప్తంగానిర్వహిస్తున్నారు. విశాఖ నుంచి వెళ్తున్న ఈ బృందం ప్రయాణాన్ని ఎన్‌వైకే ఉమ్మడి విశాఖ జిల్లా యువజన అధికారి గొర్లె మహేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు.

వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయం

విశాఖ విద్య: దేశానికి మాజీ ప్రధాని వాజ్‌పేయి చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ దాడి రమేష్ అన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా బుధవారం ఎస్‌ఏడీలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాడి రమేష్ మాట్లాడుతూ వాజ్‌పేయి మూడు సార్లు దేశానికి ప్రధానిగా ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. నేటి తరం నాయకులకు ఆయన ఆదర్శనీయుడని కొనియాడారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సిహెచ్.మంజుల, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు వల్లిరెడ్డి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు గొటివాడ వెంకటేశ్వరరావు, నాయకులు గొర్ల అప్పలరాజు పాల్గొన్నారు.

వానొస్తే వణుకే..!


సింహాద్రిపురం కొండవాలు ప్రాంతం


పాత వెంకోజీపాలెం కొండవాలు ప్రాంతంలో నివాసాలు

- కొండవాలు ప్రాంత నివాసుల్లో భయాందోళనలు
- వర్షాల సమయంలో బిక్కు బిక్కుమంటూ జీవనం
- కలగానే మిగిలిన రక్షణ గోడల నిర్మాణం
- రక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి

మద్దిలపాలెం: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండవాలు ప్రాంతాల నివాసులకు కంటి మీద కునుకు కరువైంది. చినుకు పడితే చాలు గజగజా వణికిపోతున్నారు. వర్షంతో కొండపై ఉండే రాళ్లు ఎక్కడ జారి పడతాయేనని భయపడుతున్నారు. తూర్పు, భీమిలి నియోజకవర్గాల పరిధిలోని దుర్గానగర్, సింహాద్రిపురం, పాత వెంకోజీపాలెం వంటి కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు వానొస్తే చాలు వారి గుండె జారిపోతోంది. వర్షాల సమయంలో ఎప్పుడూ ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని బిక్కు బిక్కుమంటూ జీవిస్తున్నారు. ముఖ్యంగా బండరాళ్లు, కొండచరియలు దొర్లుకుంటూ వచ్చి ఇళ్ల మీద పడతాయో, ఏ గోడ కూలిపోతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరాభివృద్ధి పరంగా ఎన్ని మార్పులు చేస్తున్నా.. కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు లేక కొన్నేళ్లుగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్న నివాసుల బతుకులకు మాత్రం భరోసా లేకుండా పోయింది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు తాత్కాలిక చర్యలతో సరిపెడుతోందే తప్పా.. శాశ్వత పరిష్కారం మాత్రం చూపించడం లేదు. కొండవాలు ప్రాంతాల్లోని ప్రజలు బతుకు జీవుడా అంటూ కాలం వెళ్లదీస్తున్నా.. ప్రజా ప్రతినిధులు మాత్రం అటుగా తొంగిచూసిందిలేదు.. పట్టించుకున్నది లేదు.

15వ వార్డులో ఇదీ పరిస్థితి..

జీవీఎంసీ 15వ వార్డులో నివసిస్తున్న ప్రజల్లో చాలా మంది స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఉన్నారు. ఇందులో అధిక శాతం నిరుపేదలే. అద్దె తక్కువ ఉంటుందని కొండవాలు ప్రాంతాల్లోనే జీవిస్తున్నారు. వర్షా కాలంలో వీరు పడే బాధలు వర్ణనాతీతం. మట్టి పెళ్లలు విరిగి ఇళ్లపై పడటం, ఇళ్లకు వెళ్లడానికి సరైన మెట్లు లేక జారి పడటం, విద్యుత్ లైన్లు అస్తవ్యస్తంగా ఉండటంతో కరెంట్ షాకులు కొట్టడం, రక్షణ గోడలు లేక బండరాళ్లు దొర్లడం, విషసర్పాలు, క్రిమికీటకాలు ఇళ్లలోకి ప్రవేశించడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. కొండవాలు ప్రాంతాల్లో రక్షణ చర్యలకు జీవీఎంసీ ప్రత్యేక ప్రణాళికలు ఏవీ అమలు చేయకపోవడంతో ప్రజలు నరకం చూస్తున్నారు. కొండలపై నివసిస్తున్న వారికి తగిన మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఉన్నంతలో భద్రతా నిర్మాణాలు చేపట్టకపోవడంతో కొండవాలు నివాసులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పర్యటించి, తమ గురించి ఆలోచించి తగు రక్షణ చర్యలు చేపట్టాలని కొండవాలు ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

వర్షా కాలంలో కునుకు కరవు

సాధారణ రోజుల్లో ఎలా ఉన్నా.. వర్షా కాలంలో మాత్రం కంటి మీద కునుకు ఉండటం లేదు. విష సర్పాలు ఇళ్లలోకి చేరడం, వర్షపు నీరు లోనికి రావడంతోపాటు బండరాళ్లు దొర్లుతాయామోనని భయంగా ఉంటుంది. ప్రభుత్వం చొరవ చూపి రక్షణ గోడలు నిర్మిస్తే బాగుంటుంది.
– సిహెచ్.చిట్టిబాబు, దుర్గానగర్

రక్షణ గోడలు నిర్మించాలి

వానొస్తే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంటుంది. ముఖ్యంగా వర్షా కాలంలో బండరాళ్లు దొర్లుతున్నాయి. పగలంతా కష్టపడి పనిచేసి ఇంటికొచ్చినా తమకు రాత్రికి వర్షం వస్తే మాత్రం భయంగా ఉంటోంది. అధికారులు స్పందించి కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మించాలి.
– కె.ఈశ్వరమ్మ, పాత వెంకోజీపాలెం

సౌత్ జోన్ యూత్ ఫెస్ట్‌కు తరలిన ఏయూ బృందం


జెండా ఊపి బృందం ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: 38వ ఏఐయూ ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ యూత్ ఫెస్టివల్‌కు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి విద్యార్థుల బృందం బుధవారం తరలివెళ్లింది. ఏయూ ఆర్ట్స్, ఫార్మసీ, ఇంజినీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలకు చెందిన 46 మంది విద్యార్థులతో కూడిన బృందం ఈ ఫెస్టివల్‌లో పాల్గొంటుంది. తమిళనాడులోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఇది జరగనుంది. మ్యూజిక్, డ్యాన్స్ లిటరరీ, థియేటర్, ఫైన్ ఆర్ట్స్ విభాగాల్లో 27 అంశాల్లో జరిగే పోటీల్లో ఏయూ విద్యార్థులు తమ ప్రతిభ చూపనున్నారు. బుధవారం ఉదయం ఏయూ పరిపాలన భవనం వద్ద ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు జెండా ఊపి విద్యార్థుల బృందాన్ని పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పూర్తి స్థాయిలో తమ సామర్థ్యాలను, ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు. జాతీయ స్థాయిలో నిర్వహించే ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రతిష్టను జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసే విధంగా విద్యార్థులు నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య రాంబాబు, దూర విద్యా సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్, చిత్రకళా విభాగాధిపతి ఆచార్య డి.సింహాచలం, విద్యార్థుల బృంద మేనేజర్ డాక్టర్ జి.కె.డి.ప్రసాద్ పాల్గొన్నారు.

పగలే వెన్నెల..!

- 13వ వార్డులో నిరంతరం వెలుగుతున్న వీధిలైట్లు
- ఫిర్యాదులు పట్టించుకోని అధికారులు


శివాజీనగర్-2లో పగలు వెలుగుతున్న వీధిలైటు


శివాజీనగర్‌లో పగటి పూట హైమాస్ట్ లైట్ల వెలుగులు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులో పలు చోట్ల వీధి లైట్లు నిరంతరం వెలిగి ఉండటంతో విద్యుత్ దుర్వినియోగమవుతోంది. రాత్రిళ్లు మాత్రమే వెలిగించాల్సిన విద్యుత్ దీపాలను ఆ శాఖ అధికారులు పట్టపగులు కూడా వెలిగించి విద్యుత్‌ను వృథా చేస్తున్నారు. శివాజీనగర్‌లో సుమారు నెల రోజులుగా నిరంతరం విద్యుత్ దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. సాధారణంగా సాయంత్రం 6 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటలు వరకు వీధిలైట్లు వెలిగిస్తారు. ఒక్కో రోజు అరగంటో, గంటో సమయంలో తేడా వస్తోంది. ఇక్కడ మాత్రం అలాకాకుండా విద్యుత్ దీపాలు రోజుల తరబడి నిరంతరం రాత్రి, పగలు వెలుగుతూనే ఉన్నాయి. పగలు లైట్లు వేయడం అవసరం లేదు. దానివల్ల విద్యుత్ దుర్వినియోగమవుతుంది తప్పా ఉపయోగం ఉండదు. ఇక్కడ మాత్రం నెల రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. సచివాలయంలో సిబ్బందికి, విద్యుత్ విభాగం అధికారులకు పలుసార్లు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. అవసరమైన చోట్ల రాత్రి వేళల్లో చీకటిగా ఉన్నప్పటికీ విద్యుత్ లైట్లు వేయకుండా వదిలేస్తున్నారని, పట్టపగలు అనవసరంగా విద్యుత్‌ను వృథా చేస్తున్నారని అంటున్నారు. వీధిలైట్ల నిర్వహణను సక్రమంగా చేపట్టాలని కోరుతున్నారు.

కళావిహీనంగా కూడళ్లు

- బీచ్ రోడ్డులోని జంక్షన్లపై నిర్లక్ష్యం
- మొక్కల సంరక్షణపై కానరాని శ్రద్ధ
- జీవం కోల్పోయిన శిల్పాలు, బొమ్మలు
- కన్నెత్తి చూడని అధికారులు


పార్క్ హోటల్ వద్ద కూడలిలో రంగులు వెలిసిపోయిన వాటర్ ఫౌంటెయిన్


కళావిహీనంగా అడవి జంతువుల బొమ్మలు


పాడవుతున్న విలువైన మొక్కలు

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులోని ప్రధానమైన కూడళ్లు నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. పార్క్ హోటల్ ఎదురుగా ఉన్న కూడలిలో వాటర్ ఫౌంటెయిన్, మొక్కలు, శిల్పాలు, అడవి జంతువుల బొమ్మలు కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. వీటి నిర్వహణపై అధికారులు దృష్టి సారించడం లేదు. నిత్యం ఈ మార్గంలో ప్రముఖులతోపాటు, పర్యాటకులు ప్రయాణిస్తుంటారు. ఇంతటి ప్రధానమైన కూడలిని ఆధునికీకరించి మరింత సుందరంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.

అధ్వానంగా 'డాల్ఫిన్' ఫౌంటెయిన్

పార్క్ హోటల్ ఎదురుగా ఉన్న డాల్ఫిన్‌ను పోలిన వాటర్ ఫౌంటెయిన్ ప్రస్తుతం నాచుపట్టి అధ్వానంగా దర్శనమిస్తోంది. రంగులు వెలిసి, ఫౌంటెయిన్‌లో నీరు సైతం మలినాలతో ఉంది. ఈ మార్గంలో ప్రయాణించే పర్యాటకులు, విదేశీయులను ఈ ఫౌంటెయిన్ ఎంతో ఆకర్షించేది. ప్రస్తుతం దీని పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఈ ఫౌంటెయిన్‌కు సత్వరం రంగులు వేసి, నీరు మార్చాల్సిన అవసరం ఉంది.

మొక్కల సంరక్షణ గాలికి..

ఈ కూడలిలోని అల్లూరి సీతారామరాజు, వైఎస్సార్ విగ్రహాల చుట్టూ ఉన్న మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. గతంలో ఈ ఐలాండ్‌ల చుట్టూ విలువైన అలంకరణ మొక్కలు నాటారు. కాల గమనంలో నిర్వహణ కరువై వీటిలో అధిక శాతం మొక్కలు దెబ్బతిన్నాయి. ఇక్కడ లాన్‌లో నాటిన గడ్డిని కటింగ్ చేసే వారు కూడా కరువయ్యారు. ఇక్కడ గతంలో నాటిన చాలా మొక్కలు చనిపోయాయి. దీంతో ఈ కూడళ్లు పర్యాటకులను ఆకట్టుకోలేక పోతున్నాయి.

రంగులు వెలిసిపోయిన శిల్పాలు

అల్లూరి విగ్రహానికి ఎదురుగా ఉన్న రెండు ఐలాండ్‌ల్లో జీవ వైవిధ్యాన్ని వివరించే విధంగా పలు శిల్పాలు గతంలో ఏర్పాటు చేశారు. నేడు వీటిని పూర్తిగా విస్మరించారు. ఎండకు ఎండి, వానకు తడవడంతో ఇవి రంగులు వెలిసిపోయాయి. వీటిని రంగులతో సుందరంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. ఈ మార్గంలో మొక్కలకు ప్రూనింగ్ సైతం చేయడం లేదు. కాలానుగుణంగా మొక్కలను సంరక్షించడానికి ప్రత్యేక సిబ్బంది, వ్యవస్థను ఏర్పాటు చేయాలి. తద్వారా ఈ కూడళ్లు మరింత ఆకర్షణీయంగా నిలుస్తాయి. ఈ మార్గంలో వెళ్లే పర్యాటకులు, నగరవాసులకు ఎంతో ఆహ్లాదాన్ని పంచుతాయి. ఈ దిశగా అధికారులు దృష్టి సారించాలని పర్యాటకులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్లు


తోటగరువు హైస్కూల్ గేటు ముందు ఎత్తయిన స్పీడ్ బ్రేకర్

ఆరిలోవ: ప్రధాన రహదారులపై వాహనాల వేగ నియంత్రణకు ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. స్పీడ్ బ్రేకర్లు ఎత్తుగా ఉండటం, వాటిపై రేడియం రంగులు వేయకపోవడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గేటు ముందు రెండు లైన్లలోను గతంలో ఎత్తయిన స్పీడ్ బ్రేకర్లు నిర్మించి రేడియం లేని తెలుపు, పసుపు సాధారణ రంగులు వేసేశారు. రేడియం రంగులు రాత్రి వేళ్ల మెరుస్తుండటంతో వాహన చోదకులకు స్పీడ్‌బ్రేకర్ కనిపిస్తుంది. రేడియం లేని రంగులు కనిపించవు. వేగ నిరోధకాలపై వేసిన సాధారణ రంగులు కాస్తా వర్షాలకు చెరిగిపోయాయి. దీంతో పగలు కూడా వాటిని గుర్తించలేక వాహన చోదకులు స్పీడ్ బ్రేకర్ల వద్ద పడిపోతున్నారు.

వర్షాలకు చెరిగిపోయిన రంగులు : ఆరిలోవ సూర్యతేజనగర్ వద్ద స్పీడ్ బ్రేకర్లది ఇదే పరిస్థితి. చినగదిలి నార్త్ షిర్డీసాయిబాబా మందిరం నుంచి పార్వతీనగర్ వరకు గతేడాది నిర్మించిన డబుల్ రోడ్డుకు ఇరుపక్కలా సూర్యతేజనగర్ వద్ద రెండు స్పీడ్ బ్రేకర్లు నిర్మించారు. వాటిపై కూడా సాధారణ రంగులే వేశారు. అవి ఇటీవల కురిసిన వర్షాలకు కరిగిపోయాయి. దీంతో రాత్రి వేళ్ల వాటిని గుర్తించలేక వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఇద్దరు వృద్ధులు పడిపోయి గాయాలపాలయ్యారు. ఇక్కడ రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లపై రేడియం రంగులు వేయాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

ప్రేమ మార్గమే క్రీస్తు సందేశం


పెదగదిలి చర్చిలో క్రీస్తు జననం సెట్



గురజాడ కళాక్షేత్రంలో చిన్నారులతో కలిసి క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న సిస్టర్ షైలాపాల్

- క్రిస్మస్ వేడుకల్లో పాస్టర్లు
- 'తూర్పు'లో ఘనంగా సంబరాలు

ఆరిలోవ: నియోజకవర్గంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆరిలోవ ప్రాంతంలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చర్చిలను అందంగా అలంకరించి, విద్యుత్ దీపాలు, క్రిస్మస్ ట్రీ, నక్షత్రాలు, ఏసు జన్మించిన పశువుల శాల సెట్ వాటిని ఏర్పాటు చేశారు. ఆరిలోవ కాలనీ, చినగదిలి, పెదగదిలిలో ఇమాన్యుయేల్ చర్చి, లీలాసుందరినగర్ ఆర్‌సీఎం చర్చి, రవీంద్రనగర్, ఆదర్శనగర్, హనుమంతవాక, ఇందిరానగర్, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం తదితర ప్రాంతాల చర్చిల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి క్రిస్టియన్లులు కుటుంబ సమేతంగా ప్రార్థనలు చేశారు. పాస్టర్లు బైబిల్ వ్యాక సందేశమిచ్చారు. ప్రేమ, క్షమ, కరుణ, శాంతి మార్గమే మానవాళికి ఏసు క్రీస్తు ఇచ్చిన సందేశమని తెలిపారు. క్రిస్మస్ పాటలు, స్కిట్లతో చిన్నాపెద్దా, యువత సందడి చేశారు. పలు రాజకీయ పార్టీల నాయకులు చర్చి లకు వెళ్లి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రేమమూర్తి ఏసుక్రీస్తు

బీచ్‌రోడ్డు: సమస్త మానవాళి రక్షణ కోసం సిలువలో ప్రాణం పెట్టిన ప్రేమమూర్తి ఏసుక్రీస్తని, ఇందు నిమిత్తమే మానవుడిగా భూమిపై జన్మించాడని సిస్టర్ షైలాపాల్ అన్నారు. పీజే స్టీఫెన్‌పాల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బుధవారం గురజాడ కళాక్షేత్రంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె దైవ సందేశమిస్తూ క్రీస్తు ప్రేమ కు ప్రతిరూపమని, క్రిస్మస్ అంటే పొరుగు వారికి ప్రేమను అందించడమే కాకుండా, ఒకరినొకరు క్షమించుకోవాలని హితబోధ చేశారు. పీజే స్టీఫెన్ పాల్ మినిస్ట్రీస్ ఫౌండర్, డైరెక్టర్ పీజే స్టీఫెన్ పాల్ వర్చువల్‌గా లైవ్‌లో క్రైస్తవులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ నెల 31న గురజాడ కళాక్షేత్రంలో వాచ్‌నైట్ సర్వీస్ ఉంటుందని, ప్రతీ ఒక్కరూ హాజరు కావాలని కోరారు. చిన్నారులు ఉత్సాహంగా క్రిస్మస్ ఆరాధనాలు, స్కిట్లు ప్రదర్శించారు.


28వ వార్డు సంతోషిమాత కాలనీ చర్చిలో ప్రసంగిస్తున్న పల్లా దుర్గారావు

ప్రత్యేక ప్రార్థనలు

జీవీఎంసీ 28వ వార్డులో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఇక్కడి చర్చిలను వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు కరుణ, దయను అందరూ ఆచరించి తోటి వారికి సాయపడాలని దుర్గారావు క్రిస్మస్ సందేశమిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు సంపంగి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి ప్రేమసదన్‌లో వేడుకలు


సత్యసాయి ప్రేమసదన్‌లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సత్యసాయిబాబా భక్తులు, చిన్నారులు


శాంతాక్లాజ్ వేషధారణల్లో డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–8లోని శ్రీసత్యసాయి ప్రేమసదన్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సత్యసాయిబాబా భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు శాంతాక్లాజ్, ఏంజెల్స్ వేషధారణలో చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలువురు చిన్నారులు, యువత క్రీస్తు గీతాలు ఆలపించి అలరించడంతోపాటు విశ్వశాంతి, సామరస్య సందేశాలను వినిపించారు. కార్యక్రమంలో సత్యసాయి విద్యావిహార్ ఉపాధ్యాయులు, భక్తులు పాల్గొన్నారు.

ఎంవీపీ ఇమ్మానుయేల్ చర్చిలో..

ఎంవీపీ కాలనీ ఇమ్మానుయేల్ లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి సభ్యులు, చిన్నారుల కోలాహలం, ఆట పాటల మధ్య క్రిస్మస్ వేడుకలు ఉల్లాస భరితంగా సాగాయి. చర్చి ఫాదర్ క్రిస్మస్ సందేశాన్ని అందిస్తూ ప్రపంచ శాంతి స్థాపనకే ఏసుక్రీస్తు జన్మించారన్నారు.

ఏడాది తర్వాత కుటుంబం చెంతకు..


కుటుంబ సభ్యులకు వ్యక్తిని అప్పగిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

విశాఖ విద్య: జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించిన వ్యక్తిని బుధవారం కుటుంబం చెంతకు చేర్చారు. షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత తెలిపిన వివరాలిలా.. గాజువాక పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్న వ్యక్తికి ఏడాది కిందట బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ ఆశ్రయం కల్పించారు. వైద్యం నిమిత్తం మెంటల్ కేర్ హాస్పిటల్‌లో చికిత్స అందించారు. ఆ వ్యక్తి కోలుకున్న తర్వాత తనది కోల్‌కతా దగ్గర మిధినీపూర్ అని చెప్పడంతో మేనేజర్ మమత శ్రద్ధా ఫౌండేషన్ సహాయంతో కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. ఏడాది కిందట తప్పిపోయిన కొడుకు రావడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ ఈస్ట్
9010133346
Office mail : sakshiadvtvsp@gmail.com